# ఇదో వ్యథ

ముఖం పగిలింది! చచ్చిపోయే స్థితిలో ఉన్నానుగానీ కొంచెం రిపేరు చేస్తే మామూలుగా తిరగ్గలను అంటున్నారు. మనిషికైనా పశువులకైనా వస్తువులకైనా రిపేరొస్తుంది. ఒక్కొక్కళ్లకి ఒక్కో డాక్టర్ ఉంటాడు.

మా డాక్టర్‌ని మెకానిక్ అంటారు.

బజార్లో ఎన్ని స్కూటర్లున్నా... నాకో గుర్తింపు ప్రాముఖ్యం ఉన్నాయి. స్టాండర్డ్ అండ్ కంఫర్టబుల్టీ అని పుటక దగ్గర్నుండి మా జాతికి మంచి పేరొచ్చింది.

సుందర్రామయ్యగారు ఎన్నో బళ్లు చూసి ఎందర్నో అడిగి నిజానికి మంచి డెసిషన్ తీసుకున్నారు. అల్లుడికి నన్ను కొనిచ్చారు.

నిన్న జరిగిన ప్రమాదంలో ఇంకో స్కూటరైతే ఒళ్ళంతా చితికిపోయేది. నాకు ఫ్రంట్ బాడీ డొల్లయి, సీటుకి అతుక్కుపోయింది.

మా ఓనరుగారు, కాదు... డ్రైవరుగారు రెండు కాళ్లు బయటకు విదుల్చుకున్నాక ఓ మోకాలు విరిగిందని నిర్ధారణ అయ్యిందట.

హాస్పటల్లో ఆయన చేరాక సుందర్రామయ్యగారి అల్లుడి ఫ్రెండ్స్ నన్నూ నా హాస్పిటల్లో చేర్పించారు.

సుత్తులూ, శానాలూ, పానాలూ (రెంచ్‌లు) స్క్రూడ్రైవర్లు, ఏవేవో వాడి నాకు సర్జరీ, మెటల్ సర్జరీ చేసి మేకప్ చేస్తున్నారు-

ఇదో స్కూటర్ స్వగతం.

ఇంక సుందర్రామయ్య అల్లుడు అనారోగ్యం గురించి ఆందోళన

పడుతున్నాడు.

ఎడం కాలుకి రెండు ఫ్రాక్చర్స్ అయ్యాయి. ఆపరేషన్ తప్పదు.

డాక్టర్లు ఖర్చులకి వెనకాడమని హామీ తీసుకుని కొన్ని మామూలు కట్లు- ఇంకొన్ని కుట్లమీద కట్లు వేశారు. దానిక్కూడా నట్లు బోల్టులూ వేస్తానన్నారు.

"వేస్తే త్వరగా మామూలుగా నడవగలుగుతాడంటే అలాగే చేయండి" అని ఆందోళనతో, బాధతో సుందర్రామయ్య ఒప్పుకున్నాడు. కాదు తప్పించుకోలేకపోయాడు.

అప్పులకు పరుగుపెట్టాడు. అవసరమయిన ఖర్చులకు డబ్బులు సంపాదించి తెచ్చాడు.

ఈ అప్పు చేస్తున్నందుకు సుందర్రామయ్య బాధ పడలేదు.

అంతకుముందు అల్లుడికి స్కూటర్ కొనడానికి చేసిన అప్పుకే ఎక్కువ కష్టపడ్డాడు.

కానీ... ఇప్పుడు కష్టంలో ఉన్నాడు కదాని... నలుగురూ నాలుగు చేతులేశారు.

ఒక్కగానొక్క కూతురు... ఇంటికెళ్లినప్పుడు... అల్లుడు పడుతున్న అవస్థ చూసి... అతను రానూపోనూ ముప్పై కిలోమీటర్లు నాలుగు బస్సులు మారి ఆఫీసుకు వెళ్ళొస్తున్నాడని కూతురు బాధపడితే జాలేసింది. సుందర్రామయ్యకి- తన ఉంగరాల్ని, భార్య మెళ్లో నగల్ని అమ్మేసి... కొంత అప్పుతెచ్చి... ఆ స్కూటర్ కొన్నాడు.

పట్టుమని పది నెల్లు తిరిగాడో లేదో ముప్పు ముంచుకొచ్చింది.

తను స్కూటర్ కొని తప్పు చేశాడా.

ఆ బాధా, ఆ తప్పుని ఒప్పు చేయాల్సిన బాధ్యతా ఆయన్ని కృంగదీస్తున్నాయి.

"స్కూటర్ కొనడంగానీ, స్కూటర్ నడపడంలోగానీ, స్కూటర్లో గానీ ఏమీ తప్పులేదు. విధి అలా ఉంది. ఒక కాలుకి దెబ్బ తగలటంతో సరిపోయింది" మిత్రులంతా ఓదార్చారు ఆ కుటుంబాన్ని.

నిజమే... ఇలాంటి ప్రమాదంలో ఎందరి ప్రాణాలు బలైపోయాయి.

తమ అదృష్టం, తమ కూతురు సౌభాగ్యం బాగుంది గనక ఇలా జరిగింది.

హాస్పటల్లో ఉన్న అల్లుడికి సేవ చేస్తున్న కూతురికి సహకరించటానికి సుందర్రామయ్యా, భార్యా వచ్చారు.

దాదాపు రెణ్నెళ్లు కూతురి ఇంటిని నడిపారు.

అల్లుడిది నలుగురున్న కుటుంబం కాదు. సుందరరామయ్య అక్క చనిపోతూ చేతిలో పెట్టిన మేనల్లుడు.

చదివించి, ఉద్యోగాన్ని కొనుక్కోవడానికి సహకరించి, అండ దండలుగా ఉన్నాడు సుందరరామయ్య, బైట సంబంధానికి పోకుండా, కట్నం ఖర్చుకి వెరచాడో, తనిన్నాళ్లు పెంచినందుకు కృతజ్ఞత ఆశించాడో, సుందరరామయ్యకి మేనల్లుడి బాధ్యత తప్పలేదు.

కూతురు బాధ్యతని వదిలించుకుందామని అనుకున్నా పెంచుకోక తప్పలేదు.

ఇల్లరికం కాని ఇల్లరికం. ఓ ఇల్లు గడవడమే కష్టమైన సుందర

రామయ్యకి అల్లుడిల్లు కూడా నడపాల్సిన బాధ్యత అదనపు బరువు అవుతోంది-

అల్లుడు మెల్లగా కోలుకున్నాడు- వాకర్ మీద అడుగులు వేయటానికి కాలు వప్పుకుంటోంది. నొప్పి తప్పుకుంటోంది.

చిన్నప్పుడీ మేనల్లుడు తప్పటడుగులు వేస్తుంటే తన దగ్గరకి నడిచి వస్తే అడుగుకి ఐదు పైసల బిళ్ల ఇస్తానని... 'రా... రా... రా' అంటూ పిలిచి పదడుగులు వేయించుకుని... ఏభై పైసలకి బదులు రూపాయిచ్చి, ముద్దుపెట్టి మురిసిపోయేవాడు.

ఇప్పుడీ అడుగులు వేయించడానికి ముఫ్ఫైవేలు అప్పయింది. ఆ ధ్యాస కూడా సుందర్రామయ్యకి లేదు గానీ ఎందుకో మేనల్లుడి బాల్యక్రీడ గుర్తొచ్చింది.

హాయిగా నవ్వుకుంటూ కూతురుతోనూ అల్లుడితోనూ గతాన్ని చెప్పి ప్రస్తుతాన్ని ఎంజాయ్ చేశాడు.

బెడ్ దిగి అడుగులేస్తున్న అల్లుడి ఆరోగ్యం గురించి ఇన్నాళ్లు ఎంత టెన్షన్ పడ్డారో- ఎన్ని ముడుపులు కట్టారో అవి తడిసి మోపుడు అవుతాయని మొక్కుకునేప్పుడూ అనుకోలేదు.

✦ ✦ ✦

అడుగుల ప్రాక్టీసై... టాక్సీలో ఇంట్లోకి అడుగుపెట్టగానే రిపేర్లు పూర్తై... ఇంటి ముందు పెళ్లి కూతుర్లా కొలువున్న స్కూటర్ కనిపించింది శివరావుకి.

"ఈ స్కూటర్...?" ప్రశ్నార్థకంగా అడిగాడు.

"బాగు చేయించేశాం... శివా!" ఆత్మీయంగా చెప్పాడు.

అల్లుడెంత ముఖ్యమో, అప్పుచేసి కొన్న స్కూటరూ అంతే ముఖ్యం సుందర్రామయ్యకి-

కానీ శివరావు మనస్సు అలా స్పందించట్లేదు.

ఓపిక రాగానే స్కూటర్ బేరానికి పెట్టాలని అమ్మేయాలని తన ఫ్రెండ్స్‌కీ, కొలీగ్స్‌కీ చెప్పాడు.

స్కూటర్ కండీషన్ నిజానికి చాలా బావుంది.

రంగు మారడంతో మరింత అందంగా కన్పిస్తోంది.

దాన్ని అమ్మితే అడవి... కొంటే కొరివి లాగా రేటు దించడమే లోటు పెంచటమే-

ఫ్రెండ్సందరూ నచ్చ చెప్పినా సుందర్రామయ్య కన్నీళ్లెట్టినా స్కూటర్ని కబేళాకి తోలేశాడు శివరావు.

ఆ స్కూటర్ స్కూటర్లా వుంటుందో, అందులో పార్ట్‌లు ఇంకో ఇంకో బండికి సరఫరా అవుతాయో తెలియని స్థితిలో ఒక మెకానిక్‌కి ఓ రేటు కట్టి అమ్మేశాడు శివరావు.

సుందర్రామయ్య గిలగిల్లాడాడు గానీ.. కొంత అప్పు తీరుతుందిలే అని సంతృప్తిపడ్డాడు.

కానీ, స్కూటర్ అమ్మిన డబ్బులు ఇంట్లోకి రాకుండానే రెక్కలొచ్చి ఎగిరిపోయాయి.

మూణ్నెళ్ల సెలవులకి, లాసాఫ్ పే అనీ, కొన్ని అప్పులు చేసినందుకు ముప్పుల్లో ఉన్నందుకూ వెళ్లిపోయిన స్కూటర్‌కి దణ్ణం పెట్టుకుని ఋణ విముక్తుడయ్యాడు శివరావు.

కాల్లో సత్తువ పెరుగుతూన్న కొద్దీ, మనిషిలో అహం పెరిగింది. కృతజ్ఞత స్థానంలో కుచ్చితమతి చెలరేగింది. శివరావు మావగారికి బైక్ కొనమని హింట్ ఇచ్చాడు. డాక్టర్ బండి స్టార్ట్ చెయ్యడానికి వీల్లేదని అన్నారు. అందుకని ఆటో స్టార్ట్ ఉండే బండి కొనటమే బెటరని అతను అనుకున్నాడు.

(మేన)మామగారి గుండెల్లో పెళ్ళాం చేత బాంబేయించాడు-

ఇప్పుడు ఇంకెక్కడ అప్పు దొరుకుతుందా అని విలవిల్లాడాడు. బతుకు బండి నడపలేని బడుగు తండ్రి.

అక్కడ కబేళాకి చేరిన స్కూటరూ అదే పోకడలో విలవిల్లాడు తోంది.

'కళ్లుతీసి ఒకళ్లకీ, కిడ్నీ కోసి మరొకళ్లకీ' అన్నట్లు ప్రతీ పార్టూ ముక్కలు చేసి... స్వదేహ దానం చేస్తూ ఏడుస్తోందది!

'కొన్న' తండ్రి పడ్డ కష్టం తెలుసు దానికి. అందుకే సుందర్రామయ్య మీద ప్రేమతో ముఖం పగిలినా అల్లుడిని కాపాడింది.

శివరావుకి ఆ కృతజ్ఞత లేకపోగా వెన్ను విరిగినంత అప్పుల చిక్కుల్లో ఉన్న మామగారిపై... మరో పిడుగు వే(యించే)శాడు.

సుందర్రామయ్యకి 'అల్లుని మంచితనంబు' అనే పద్యం గుర్తొచ్చి... అది చదువుకున్నా గమనించని తన తప్పు తనే తెల్సుకుని... బుద్దొచ్చి, బుద్ధిరాక, మళ్లీ తప్పయినా అప్పు చేయడానికి సిద్ధపడి వీధికెక్కాడు.

డొల్లయిపోయిన కన్నుల్తో, డొక్కయిన స్కూటర్ సుందర్రామయ్య ని చూసి భోరుమంది.

